క్లుప్తంగా

ఏబీఏబీఎస్ మండల అధ్యక్షుడిగా రవికుమార్



మైలవరం: అఖిల భారత అయ్యప్ప భక్తుల సంఘం (ఏబీఏబీఎస్) మైలవరం మండల శాఖ అధ్యక్షుడుగా మట్టా రవికుమార్‌ను నియమించినట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు అడ్వకేట్ వాండ్రాసి పెంచలయ్య శనివారం తెలిపారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తుల సమస్యల పరిష్కరిస్తానని రవికుమార్ పేర్కొన్నారు. తనను మండల అధ్యక్షుడిగా నియమించిన పెంచలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

దోమల నివారణకు చర్యలు



మైలవరం: మండలంలోని పొందుగల గ్రామ పంచాయతీలో విష జ్వరాలు ప్రబలకుండా శనివారం దోమల నివారణ మందు పిచికారి చేయించినట్లు సర్పంచ్ కోటమ్మ తెలిపారు. గ్రామ ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. అనారోగ్య సమస్యలు ఉంటే ముందుగా తెలియజేయాలని గ్రామస్తులను కోరారు. పంచాయతీ కార్యదర్శి సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు నాణెం అందజేత



చాట్రాయి: విజయ కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో కల్యాణమస్తు పథకాన్ని శనివారం లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని యర్రవారిగూడెం పాల సంఘంలో పాలు పోస్తున్న బొల్లినేని సర్వేశ్వరరావు కుమారుడు ఏసుబాబు, ఎర్రా వెంకట పుల్లారావు కుమార్తె సౌజన్యల వివాహం సందర్భంగా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.20 వేలు విలువ చేసే బంగారు నాణాన్ని పాలకవర్గ సభ్యుడు బొట్టు రామచంద్రరావు అందజేశారు.

విలువలతో కూడిన విద్య అవసరం



ఆగిరిపల్లి: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా మండలి అధికారి శ్రీమన్నారాయణ సూచించారు. శనివారం మండలంలోని తోటపల్లి హీల్ పాఠశాల ఆవరణలో నూతనంగా ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యం పెంపొందే విధంగా విద్యా బోధన చేయాలని సూచించారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు



నూజివీడు: ప్రభుత్వ ఉద్యోగికీ పదవీ విరమణ తప్పనిసరి అని ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. గత నెల 30న రిటైర్ అయిన నూజివీడు ఏడీఏ విద్యాసాగర్ పదవీ విరమణ కార్యక్రమాన్ని శనివారం మండలంలోని తుక్కులూరులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యాసాగర్ భావి జీవితం సుఖ సంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు. అనంతరం ఏఓలు, వ్యవసాయశాఖ సిబ్బంది విద్యాసాగర్ దంపతులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి ఏఓలు పలగాని చెన్నారావు, జొన్నలగడ్డ భవాని, ఆలూరి చాముండేశ్వరి, శివశంకర్, ల్యాబ్ ఏఓ మాధవి ప్రియానంద, ఎస్టీఎల్ ఏఓ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

7న స్కూల్ గేమ్ సెలక్షన్స్

పెనుగంచిప్రోలు: ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో పెనుగంచిప్రోలు మండల స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ ఈనెల 7వ తేదీన స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు ఎంఈవో డి.రవీంద్ర, పీడీ వి.రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగంలో ప్రభుత్వ పాఠశాలలు, గుర్తింపు పొందిన పాఠశాలల క్రీడాకారులు బాలురు, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షెటిల్, చెస్, యోగా, అథ్లెటిక్స్‌లలో సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం తొమ్మిది గంటలకు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో హాజరుకావాలని సూచించారు.

అలంకారప్రాయంగా చేతిపంపులు

- మరమ్మతులకు గురైనా పట్టించుకోని అధికారులు
- మరమ్మతు గ్రాంట్ నిలిపేసిన ప్రభుత్వం
- పంచాయతీలకు భారంగా చేతిపంపుల నిర్వహణ
- నీటి కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో చేతి బోరు పంపులు అలంకారప్రాయంగా మారాయి. గ్రామ పంచాయతీల్లో నిధుల లేమితో మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో చేతి పంపులు నిరుపయోగంగా మారుతున్నాయి. పలుచోట్ల ఉపయోగంలో ఉన్న బోరు పంపులపై సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయింది. అనేక పంపులు వాడుకలో లేక తుప్పు పట్టాయి. కొండపల్లి మున్సిపాలిటీ, ఇబ్రహీంపట్నం మండలంలోని గ్రామాల్లో సుమారు 400కు పైగా చేతిపంపులు ఉన్నాయి. గతంలో బోరు పంపుల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటు మంజూరు చేసేది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో మండల పరిషత్ నుంచి మెటీరియల్ కొనుగోలు చేసి పంపులు రిపేరు



ఇబ్రహీంపట్నం ఖాజీమాన్యం ఎంపీపీ పాఠశాల వద్ద రిపేరులో బోరుపంపు



కొండపల్లి మున్సిపాల్టీ కార్యాలయం సమీపంలో పనిచేయని బోరుపంపు



కేతనకొండ ష్మశాన వాటికలోని బోరుపంపు చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

చేయించేవారు. ప్రస్తుతం గ్రాంటు నిలిపేయడంతో చేతి పంపుల నిర్వహణ గ్రామ పంచాయతీలకు భారంగా మారింది.

శిథిలావస్థకు చేరిన చేతి పంపులు

గ్రామీణ ప్రాంతాల ప్రజల వాడుకకు చేతి పంపు నీరే ఆధారం. కనీసం గ్రామాల్లో ఉన్న చేతి బోరు పంపుల నిర్వహణపై ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ, మండల పరిషత్, గ్రామ పంచాయతీ అధికారులు దృష్టి సారించకపోవడంతో ప్రజలకు నీటి సమస్య తప్పడం లేదు. రిపేరుకొచ్చిన పంపులను అధికారులు పట్టించుకోకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రజల అవసరాలకు పలు వీధులతో పాటు వివిధ పాఠశాలలు, శ్మశాన వాటికల్లో నీటి అవసరాలు తీర్చేందుకు ఏర్పాటు చేసిన బోరు పంపులు సైతం మరమ్మతులకు గురైనా అధికారుల పర్యవేక్షణ కరువైంది. గ్రామాల్లో చేతి పంపులను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు వాడుకనీటి కష్టాలు

గ్రామాల్లో ప్రజలు తాగేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు కృష్ణానది నీటిని కుళాయిల ద్వారా పంపిణీ చేస్తున్నప్పటికీ వాడుకనీటి కోసం ప్రజలు బోరుపంపులపై ఆధారపడ్డారు. రిపేరుకు వచ్చిన చేతిపంపులు సకాలంలో మరమ్మతులు చేపట్టకపోవడంతో వాడక నీటికోసం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సకాలంలో చేతి పంపులు రిపేరు చేసి వాడుకనీటి అవసరాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

అరకొర నీటితో అవస్థలు



కొండపల్లి మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాల్లో అనేక బోరు పంపులు మరమ్మతులకు గురైయ్యాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజల వాడుక నీటి అవసరాలు తీరడం లేదు. అరకొరగా వచ్చే తాగునీటినే వాడుకోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి మరమ్మతులకు గురైన బోరుపంపులు బాగుచేయించాలి.

– కలకంటి బసవయ్య, కొండపల్లి

మరమ్మతులకు వేధిస్తున్న నిధుల కొరత



కోటికలపూడిలో చేతి పంపు దుస్థితి

గ్రామాల్లో బోరు పంపులకు మరమ్మతులు చేపట్టాలంటే నిధుల కొరత వేధిస్తోందని సర్పంచులు చెబుతున్నారు. గతంలో ప్రభుత్వ గ్రాంటుతో మండల పరిషత్ అధికారులు చేతి పంపుల సామగ్రి కొనుగోలు చేసి బోర్ల మరమ్మతులు చేయించేవారు. 2024లో పంపుల మెకానిక్ పదవీ విరమణ చేయడంతో వాటిని రిపేర్ చేసేవారు కరువైయ్యారు. ఏడాది క్రితం ప్రైవేట్ వ్యక్తిని నియమించుకున్న అధికారులు మూడు నెలల పాటు పంపుల మరమ్మతులు చేయించారు. అతనికి జీతభత్యాలు భరించలేక విధుల నుంచి తప్పించారు. బోరుపంపుల బాధ్యత గ్రామ పంచాయతీలకు తప్పలేదు. నిధుల లేమితో గ్రామ పంచాయతీలు చేతిపంపుల నిర్వహణ చేపట్టలేకపోతున్నాయి.

'చలో విజయవాడ' జయప్రదం చేయండి



మైలవరం: ప్రభుత్వ ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య చైర్మన్ ఎల్. సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మైలవరం మండల విద్యాశాఖ కార్యాలయం ప్రాంగణంలో ఈనెల 7వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ యూనియన్ నాయకులు శనివారం కరపత్రాలు విడుదల చేశారు. ఉమ్మడి సర్వీసు రూల్స్ సాధన, 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి, కారుణ్య నియామకాలు, సీపీఎస్ రద్దు, మెమో 57 అమలు, పెండింగ్ బకాయిలు తదితర డిమాండ్ల సాధనకు రాష్ట్ర స్థాయి ధర్నా కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఉపాధ్యాయులను నేడు ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలను అమలు చేసే వారిగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాట్రాయి: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చనుబండ, కృష్ణారావుపాలెం, నరసింహారావుపాలెం గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు, అలాగే చాట్రాయి తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో ఉదయం 10 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇంకెన్నాళ్లు ఈ చెత్త బాధలు..?

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి వాసులకు చెత్త బాధలు తప్పడం లేదు. గత మూడు రోజుల నుంచి పారిశుద్ధ్య కార్మికులు విధులకు హాజరు కాకపోవడంతో వీధులన్నీ చెత్తతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. గత కొన్ని నెలలుగా ఇదే తంతు కొనసాగుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులకు సమయానికి జీతాలు ఇవ్వకపోవడం, మంత్రి కొలుసు పార్థసారథి ఆరు నెలల క్రితం పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు పెంచినా.. ఇప్పటివరకు వాటిని అధికారులు ఇవ్వడం లేదంటూ విధులకు హాజరు కావడం లేదు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేత నేరుసు రాజేష్ మాట్లాడుతూ ప్రతినెలా అధికారుల అలసత్వం వల్ల సమయానికి పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో వారు విధులకు హాజరు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గ్రామస్తులు అనారోగ్యం పాలు అవుతున్నారని చెప్పారు. చెత్తను తొలగించకపోతే గ్రామస్తులతో కలిసి సచివాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



ఆగిరిపల్లి ప్రధాన రహదారిలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

టెట్‌పై ప్రభుత్వం స్పందించాలి

నూజివీడు: నిబంధనల ప్రకారం ఉపాధ్యాయ ఉద్యోగాలు పొంది సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష ఉత్తీర్ణత నుంచి మినహాయింపు ఇవ్వాలని సెకండరీ గ్రేడ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్జీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొక్కెరగడ్డ సత్యం శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం తగిన చర్యలు తీసుకొని, నిర్ణీత అర్హతలతో నియమించిన ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ ఉత్తీర్ణత నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా..



పార్టీ నాయకులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను శనివారం పరామర్శించారు. నరసింగపాలెం పార్టీ నాయకుడు దోమ చంద్రశేఖర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తోటపల్లికి చెందిన రొయ్యల అభిషేకం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే అమ్మవారి గూడెంకు చెందిన గజ్జల రోశమ్మ మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని భరోసా కల్పించారు.

ఘనంగా స్వామిదాసు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు

తిరువూరు: తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు జన్మదిన వేడుకలను శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వామిదాసుకు శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరెడ్ల వీరారెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కోట దాసు, తిరువూరు మండల, పట్టణ అధ్యక్షులు తాళ్ళూరి నవీన్‌కుమార్, చలమాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకట రెడ్డి, మోదుగు ప్రసాద్, ఏరువ ప్రకాష్‌రెడ్డి, రామవరపు మంజుల, నాయకులు కలకొండ రవికుమార్, సుధారాణి, రామవరపు ప్రసాద్, చిట్టిపోతుల లక్ష్మీనారాయణ, నాగరాజు, మోషే, శ్రీనాథ్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత వైద్య సేవలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): దసరా శరన్నవ రాత్రుల సందర్భంగా ఇంద్రకీలాద్రి దిగువున గల కనకదుర్గానగర్, పరిసర ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడికల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రోగ్రాం కమిటీ చైర్మన్ దేవతి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉత్సవాలు ప్రారంభించిన నాటి నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు 24 గంటలపాటు ఈ ఉచిత వైద్య శిబిరంలో సేవలు అందించామని తెలిపారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పొన్నూరు హరినాథ్ ప్రసాద్, పువ్వాడ లక్ష్మీ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో ఈ 12 రోజుల్లో సుమారు 50 వేల మంది భక్తులకు వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. అలాగే ఫిజికెమ్ ఫౌండేషన్ అధినేత సీసీ కేశవరావు రథం సెంటర్‌లో ప్రసాదాల పంపిణీకి సహకరించారని పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని భక్తులకు వైద్య సేవలు అందించిన డాక్టర్ కోలా విజయ శేఖర్ వైద్య బృందానికి, మందులు అందించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా ఆర్థిక సహకారం అందించిన లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడికల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సబ్‌జైలు సందర్శన



సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న సంస్థ చైర్మన్ గోపి, సెక్రటరీ కృష్ణయ్య

నూజివీడు: పట్టణంలోని సబ్ జైలును ఉమ్మడి కృష్ణాజిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ గుట్టల గోపి, సెక్రటరీ కేవీ కృష్ణయ్య శనివారం సందర్శించారు. దీనిలో భాగంగా సబ్‌జైలులో ఉన్న రిమాండ్ ఖైదీలను అడిగి వారి కేసుల వివరాలు తెలుసుకున్నారు. వారికి వడ్డిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. న్యాయవాదిని నియమించుకునే స్థోమత లేకపోతే న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సాయం అందిస్తామని తెలిపారు. బెయిల్‌పై విడుదలైన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని, కుటుంబంతో కలిసి మెలిసి బాధ్యతాయుతంగా జీవించాలని సూచించారు. అనంతరం స్టోర్ రూం పరిశీలించారు. వీరితో పాటు 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అనూష, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి, జైలు సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్, సెక్రటరీలను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నం ప్రసాద్, సెక్రటరీ హరిబాబు, బార్ సభ్యులు కలిశారు.

షెడ్ల నిర్మాణంతో పశు సంరక్షణ సులభతరం



పశువుల షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీడీవో

ముసునూరు: గ్రామాల్లో పశువుల షెడ్ల నిర్మాణంతో పశు సంరక్షణ సులభతరం కానుందని ఎంపీడీఓ పి.ఏసుబాబు అన్నారు. మండల కేంద్రం ముసునూరులో పశువుల షెడ్ల నిర్మాణానికి అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి శనివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు తన సొంత స్థలంలో 20 శాతం భాగస్వామ్యంతో పశువుల షెడ్డు నిర్మించుకుంటే, 80 శాతం నిధులు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఆరు గేదెల సామర్థ్యం గల షెడ్డు నిర్మాణానికి రెండు లక్షల అంచనా కాగా, రైతు వాటా రూ.20 వేలు, ప్రభుత్వ వాటాగా లక్షా ఎనభై వేలు చెల్లిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి, ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు దేవినేని శ్రీధర్, వార్డు సభ్యుడు నరసింహారావు, డిప్యూటీ ఎంపీడీఓ బి.ఎ. సత్యనారాయణ, ఉపాధి హామీ ఏపీఓ రోజ్‌లీల తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బతుకమ్మ నిమజ్జనం



సూరంపాలెంలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మహిళలు

చాట్రాయి: మండలంలోని సూరంపాలెం గౌడ కాలనీలో శనివారం రాత్రి బతుకమ్మ నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా బతుకమ్మకు ఇష్టమైన తంగేడు పూలతో తయారు చేసిన సజ్జను మహిళలు తలపై పెట్టుకుని మంగళవాయిద్యాలతో పాటలు పాడుకుంటూ గ్రామంలో ఊరేగించారు. అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

• ఆదమరిస్తే అంతే సంగతి

మండలంలోని లీలానగర్ నుంచి దిగవల్లి మార్గంలో తారురోడ్డు మార్జిన్ కోతకు గురై గుంత ఏర్పడటంతో ప్రమాదభరితంగా తయారైంది. ఈ మార్గంలో నిత్యం కార్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహ నాలు, ఆటోలు రాకపోకలు సాగిస్తున్నాయి. రమణక్కపేట, తూర్పు దిగవల్లి, వలసపల్లి, అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి, లోపూడి, సూరేపల్లి, బాస్వరప్పాడు, సోమవరం, మర్లపాలెం, కొత్తగూడెం తదితర గ్రామాలకు వెళ్లాలంటే ఈ మార్గంలోనే వెళ్లాలి. ప్రమాదం జరగకముందే మార్జిన్‌లో ఏర్పడిన గొయ్యిని పూడ్చాలని అధికారులకు వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– నూజివీడు



లీలానగర్ నుంచి దిగవల్లి మార్గంలో గొయ్యి పడి ప్రమాదభరితంగా ఉన్న రహదారి మార్జిన్

అత్యంత వైభవంగా చండీ హోమం



విజయవాడ వన్‌టౌన్ పీఎస్‌లో పూజలు నిర్వహిస్తున్న సీపీ రాజశేఖరబాబు



అన్నదానం ప్రారంభిస్తున్న ఈఓ శీనానాయక్

- పూర్ణాహుతితో ఉత్సవాలకు ముగింపు పలికిన సీపీ రాజశేఖరబాబు
- పోలీసు అధికారులకు, పేదలకు అన్నదానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపును పురస్కరించుకొని విజయవాడలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో శనివారం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. దసరా ఉత్సవాల సందర్భంగా స్టేషన్ ప్రాంగణంలో కలశాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఉత్సవాల ముగింపు సందర్భంగా వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో చండీ హోమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు, పలువురు ఐపీఎస్ అధికారులు హాజరై పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే మహర్నవమి రోజున ఆయుధ పూజలు కూడా నిర్వహించారు. విజయ దశమి రోజున సాక్షాత్ దుర్గమ్మ ఇంద్రకీలాద్రి కొండ దిగి పోలీసుస్టేషన్‌కు వచ్చి పూజలందుకొని తిరిగి వెళ్లింది. అటువంటి పలు కార్యక్రమాల అనంతరం అన్నసమారాధన నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి శీనానాయక్, పోలీసు కమిషనర్ రాజశేఖరబాబులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేలాది మంది పేదలకు స్టేషన్ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. పోలీసు కుటుంబాలు సైతం స్టేషన్ ప్రాంగణంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాల్లో జాయింట్ సీపీ, డీసీపీలు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు. స్థానిక సీఐ గురుప్రకాష్, ఏసీపీ ఎస్.దుర్గారావు పర్యవేక్షించారు.

ఉత్సవాలను విజయవంతం చేశాం

తమ పోలీసు శాఖ అంకిత భావంతో పని చేసి దసరా ఉత్సవాలను విజయవంతం చేశారని పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు పేర్కొన్నారు. వన్‌టౌన్ స్టేషన్‌లో పూజల అనంతరం ఆయన సిబ్బందిని అభినందించారు. అధికారులందరూ కలిసికట్టుగా ఉత్సవాలను చక్కగా నిర్వహించారని కొనియాడారు.

ముగిసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



వట్టిగుడిపాడులో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఆగిరిపల్లి: మండలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఆగిరిపల్లిలోని శోభనాచల వేద శాస్త్ర పాఠశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ తల్లికి వేద విద్యార్థుల మంత్రోచ్ఛారణాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. యాదవల మండపంలో విద్యుత్ కాంతులతో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. వట్టిగుడిపాడులోని రామాలయం సెంటర్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామోత్సవం జరిగింది. అనంతరం 36 కేజీల భారీ లడ్డూను గ్రామానికి చెందిన వెల్లంకి మహేష్, కుప్పాల పార్థసారథి రూ.52 వేలకు పాడుకున్నారు.